క్లుప్తంగా

వాహనాల తనిఖీ



కర్లపాలెం: లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే చట్ట ప్రకారం కేసులు నమోదు చేస్తామని కర్లపాలెం ఎస్‌ఐ ఎం.శివయ్య హెచ్చరించారు. గురువారం రాత్రి కర్లపాలెంలో ఎస్‌ఐ ఎం.శివయ్య పలు వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్సులు, బండి పర్మిషన్ పత్రాలు వెంట ఉంచుకోవాలని చెప్పారు. ద్విచక్ర వాహనం నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారు నడిపేవారు సీట్ బెల్టు పెట్టుకోవాలని ఎస్‌ఐ చెప్పారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. లైసెన్సు లేని వాహనాలకు ఎస్‌ఐ శివయ్య అపరాధ రుసుము విధించారు.

ఆర్‌బీకేల పరిశీలన



వేమూరు: రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించేందుకు ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసిందని మార్టూరు ఏడీఏ శ్రీనివాసరావు చెప్పారు. వేమూరు మండలంలోని కొన్ని రైతు భరోసా కేంద్రాలను ఆయన గురువారం తనిఖీ చేశారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ఆర్‌బీకేల ద్వారా సాగుకు కావాల్సిన ఉత్పాదకాలు, ఉపకరణాలను అందిస్తోందని వెల్లడించారు. ఆర్‌బీకేల్లోని సిబ్బందిపై ఫిర్యాదు రావడంతో తనిఖీలు చేపడుతున్నామని వివరించారు. మండలంలోని చావలి, బలిజేపల్లి, పెనుమర్రు, పెరవలి, పెరవలిపాలెం గ్రామంలోని ఆర్‌బీకేలను తనిఖీ చేసినట్టు వెల్లడించారు. కార్యక్రమంలో ఏఓ చందోలు సునీత తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలి రూరల్: రైల్లో నుంచి జారి పడి తీవ్రంగా గాయపడిన గుర్తు తెలియని వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 35 నుండి 40 ఏళ్ల మధ్య వయసున్న గుర్తు తెలియని వ్యక్తి ఈ నెల 16వ తేదీన కొలకలూరు రైల్వే స్టేషన్ సమీపంలో రైలు నుంచి జారి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు గమనించి 108కు సమాచారమివ్వగా, తెనాలి వైద్యశాలకు తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం కోసం గుంటూరు వైద్యశాలకు పంపగా అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు తెనాలి జీఆర్పీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

షటిల్ పోటీల్లో సంజయ్, అరవింద్ సత్తా

తెనాలి అర్బన్: మండలంలోని కొలకలూరులో కిస్సా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన అంతర్ జిల్లాల షటిల్ పోటీల్లో బోసు రోడ్డులోని నెహ్రూనికేతన్ పాఠశాల విద్యార్థులు ఎ.సంజయ్, ఎ.అరవింద్ (బాలుర డబుల్స్ విభాగంలో) ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. పాఠశాల ఆవరణలో గురువారం వీరికి స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి మురళీకాంత్ మెమెంటోలు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెనాలి లాడ్జిలో నెల్లూరు వాసి మృతి



తెనాలి రూరల్: స్థానిక లాడ్జిలో నెల్లూరుకు చెందిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. సుమారు 40 నుంచి 45 ఏళ్ల మధ్య వయసున్న వ్యక్తి తెనాలి రైల్వే స్టేషన్ ఎదురు ఉన్న లాడ్జికి బుధవారం వచ్చాడు. తన పేరు కరీముల్లా అని, ఊరు నెల్లూరు అని చెప్పి మంచం అద్దెకు తీసుకున్నాడు. గురువారం మధ్యాహ్నం దానిపై మృతి చెంది ఉన్నాడు. మృతుడు నీలం రంగు జీన్సు ప్యాంటు, కాఫీ రంగు గళ్ల చొక్కా ధరించి ఉన్నాడు. సమాచారం అందుకున్న త్రీ టౌన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని తెనాలి జిల్లా వైద్యశాలకు తరలించారు. లాడ్జి నిర్వాహకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జన సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



ప్రజలతో మాట్లాడుతున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

నిజాంపట్నం: ప్రజల సంక్షేమమే ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రధాన లక్ష్యమని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు చెప్పారు. నిజాంపట్నం మండలం పల్లపట్ల గ్రామంలో గురువారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రతి ఒక్కటి అమలు చేసే దిశగా జగనన్న నిరంతరం శ్రమిస్తున్నారని పేర్కొన్నారు. సంపూర్ణంగా పేదరిక నిర్మూలన దిశగా ప్రవేశపెట్టిన నవరత్నాల పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇంటి గడప వద్దకే అందిస్తున్న జగనన్న పాలన దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. గ్రామంలో ఏ గడప ముంగిటకు వెళ్లినా జగనన్న పథకాలు అందుకుంటూ లబ్ధిపొందుతున్నామని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్న తీరు చరిత్ర పుటల్లో నిలిచిపోతోందన్నారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రజలకు పాలనను మరింత చేరువ చేశారన్నారు. గ్రామంలో ఇప్పటి వరకు 6,233 మంది వివిధ పథకాల ద్వారా రూ.12,82,34,333 లబ్ధిపొందినట్లు చెప్పారు. తొలుత పంచాయతీ పరిధిలోని కోపూరివారిపాలెం ఇస్లాంపేటలో ముస్లింల శ్మశాన వాటికకు ప్రహరీ నిర్మాణం కోసం మోపిదేవి శంకుస్థాపన చేశారు.

అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి ప్రభుత్వం అందిస్తున్న కోడిగుడ్లను పరిశీలించారు. చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు నర్రా సుబ్బయ్య, సర్పంచ్ గంగుల వెంకటరత్నప్రసాద్, ఎంపీటీసీ సభ్యులు నాజర్‌ఖాన్, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ బసవపున్నయ్య, నాయకులు ప్రసాదం వాసుదేవ, పట్టపు సాంబశివరావు, పట్టపు రామారావు, బొడ్డు వంశీకృష్ణ, సాయి, భాషా, జిలానీ, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



అంగన్‌వాడీ కేంద్రంలో కోడిగుడ్లను పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు

పంచాయతీ సమావేశంలో తీర్మానాలు

పిట్టలవానిపాలెం: భవనంవారిపాలెం గ్రామ పంచాయతీ సర్వసభ్య సాధారణ సమావేశాన్ని గ్రామ సర్పంచ్ మోదుగుల శివనాగేశ్వరి అధ్యక్షతన గ్రామ కార్యదర్శి వసుంధరలక్ష్మి గురువారం నిర్వహించారు. గ్రామంలో పలు సమస్యలు పరిష్కరించాలని సభ్యులు సూచించిన అంశాలపై తీర్మానాలు చేశారు. ప్రధానంగా గ్రామంలో కరెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలని, విద్యుత్ తీగలు కిందికి వేలాడుతూ ప్రమాదకరంగా ఉన్నాయని సభ్యులు తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా అందిన నిధులతో గ్రామంలో నిర్వహించాల్సిన పనులపై చర్చించారు. గ్రామంలో సామూహిక మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టేందుకు పంచాయతీ అనుమతి కోరుతూ తీర్మానం ప్రవేశపెట్టారు. పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు చెల్లించేందుకు, చెరువుల వేలం నిర్వహణకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ బడుగు మాధవి, స్థానిక ఎంపీటీసీ సభ్యురాలు దొంతిరెడ్డి సింధు, వార్డు సభ్యులు మోదుగుల శంకర్‌రెడ్డి, నిజాంపట్నం సుబ్బారావు, భరత్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

పద్యాస్త్రం ప్రయోగించిన వేమన

మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి

బాపట్లటౌన్/బాపట్ల అర్బన్/నగరం : సమాజంలో వేళ్లూనుకున్న రుగ్మతలపై పద్యాస్త్రం ప్రయోగించిన వేమన జీవితాన్ని యువతరం ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి తెలిపారు. పట్టణంలోని వివేకానంద కాలనీలో గురువారం ధృతి సాహిత్య, సాంస్కృతిక సామాజిక సంస్థ ఆధ్వర్యంలో వేమన జయంత్యుత్సవం నిర్వహించారు. తొలుత వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి మాట్లాడుతూ సమాజానికి సరళమైన పద్యాలతో జీవన సారాన్ని వివరిస్తూ మార్గ నిర్దేశకత్వాన్ని అందించిన ఘనత వేమనకే దక్కిందన్నారు. ధృతి సంస్థ నిర్వాహకులు కళ్ళం హరినాథ్‌రెడ్డి మాట్లాడుతూ తెలుగు సాహితీ లోకంలో వేమన శతకానికి ఉన్న ప్రాధాన్యం అధికమన్నారు. తరతరాలకు మార్గదర్శకంగా వేమన సాహిత్యం నిలిచి ఉంటుందని పేర్కొన్నారు. వేమన సాహిత్యాన్ని భావితరాలకు అందించాలనే లక్ష్యంతో ధృతి సంస్థ పనిచేస్తోందన్నారు. కార్యక్రమంలో వివేక సర్వీస్ సొసైటీ కార్యదర్శి అంబటి మురళీకృష్ణ, పిన్నిబోయిన శ్రీమన్నారాయణ, ధృతి సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

● తల్లిప్రేమలోని తియ్యదనం.. వేమన పద్యంలోని గొప్పదనం తెలియనివారుండరంటే అతిశయోక్తి కాదని గ్రంథాలయ అధికారి జొన్న బ్రహ్మేంద్ర అన్నారు. సహజ కవి వేమన జయంత్యుత్సవం సందర్భంగా మండలంలోని మంత్రిపాలెం శాఖ గ్రంథాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాహిత్యానికి వేమన చేసిన సేవలు అజరామరమన్నారు. అనంతరం వేమన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వేమన సాహిత్యానికి చేసిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఆర్.సాంబరావు, ఆర్.కిశోర్, పాఠకులు తదితరులు పాల్గొన్నారు.



వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే చీరాల గోవర్ధనరెడ్డి



మంత్రిపాలెం గ్రంథాలయంలో వేమన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

టెక్స్‌టైల్ మిల్స్ సమస్యల పరిష్కారానికి కృషి

నెహ్రూనగర్: టెక్స్‌టైల్ మిల్స్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ లేళ్ళ అప్పిరెడ్డి పేర్కొన్నారు. నగరంలోని ఓ హోటల్‌లో గురువారం ఏపీ టెక్స్‌టైల్ మిల్స్ అసోసియేషన్ సమావేశం చైర్మన్ లంక రఘురామిరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఆరు నెలలుగా స్పిన్నింగ్ పరిశ్రమ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటుందన్నారు. ముఖ్యంగా విద్యుత్తు సబ్సిడీ బకాయిలపై ప్రభుత్వంతో చర్చించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని విన్నవించారు. అసోసియేషన్ సమస్యల్ని సీఎం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని అప్పిరెడ్డి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ వైస్ చైర్మన్లు సామినేని కోటేశ్వరరావు, ఎం. సత్యనారాయణ, కోటిరావు, ప్రసాద్ చౌదరి నాయకులు పాల్గొన్నారు.



అప్పిరెడ్డిని సన్మానిస్తున్న అసోసియేషన్ నేతలు

కోనేటిపురంలో భావనారుషి స్వామి సేవ



కోనేటిపురం(భట్టిప్రోలు): భట్టిప్రోలు మండలం కోనేటిపురం పద్మశాలీయ బహూత్తమ సంఘం ఆధ్వర్యంలో శ్రీ భావనారుషి స్వామి సేవా కార్యక్రమాలు రెండు రోజులుగా ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం స్థానిక ఆలయంలో యజ్ఞం, ప్రభ ఉత్సవం జరిగాయి. గురువారం సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. అనంతరం సమారాధన జరిగింది. కార్యక్రమాలను సంఘ పెద్ద శ్రేష్ఠులు, పెత్తందార్లు జొన్నాదుల వెంకట సుబ్బారావు, వీర అంక నాగమల్లేశ్వరరావు, డోకుపర్తి నాగేశ్వరరావు, పడవల పెరుమాళ్లు, ఆకురాతి విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చుండూరు రైల్వే గేటు మూత

చుండూరు(వేమూరు): చుండూరు రైలు గేటును మరమ్మతుల కోసం మూడు రోజులపాటు మూసి వేస్తామని రైల్వే సెక్షన్ ఇంజినీర్ ప్రేమ చంద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 20వ తేదీ నుంచి 22వ తేదీ వరకు గేటు మూసి ఉంటుందని, ప్రయాణికులు గమనించాలని కోరారు.

15 మద్యం సీసాలు స్వాధీనం



అదుపులోకి తీసుకున్న వ్యక్తితో ఎస్‌ఈబీ పోలీసులు

నగరం: అక్రమంగా మద్యం విక్రయాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సీఐ దేవర శ్రీనివాసరావు చెప్పారు. మండలంలోని పెదపల్లి గొల్లపాలెంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని గురువారం ఎస్ఈబీ పోలీసులు అరెస్ట్ చేశారు. సీఐ మాట్లాడుతూ పెదపల్లి గొల్లపాలెంలో బెల్లంకొండ వెంకటేశ్వరావు అక్రమంగా మద్యం విక్రయిస్తుండంతో అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అతనివద్ద నుంచి 15 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

అమృతోత్సవ కాంతులు



బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాల స్థాపించి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈనెల 21న నిర్వహించనున్న ప్లాటినం జూబ్లీ ఉత్సవాలకు కాలేజీ ముస్తాబైంది. విద్యుత్ వెలుగుల్లో తళుకులీనుతోంది. ఈ సందర్భంగా కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ అమృతోత్సవాల్లో భాగంగా కోలాటం, భారత నాట్యం, రెట్రో డ్యాన్స్, ఫ్లాష్ మోబ్, సంగీత ప్రదర్శనలు నిర్వహించనున్నట్టు వివరించారు. ఈ వేడుకల్లో 1200 మంది పూర్వ విద్యార్థులు, శాస్త్రవేత్తలు, ప్రగతిశీల రైతులు పాల్గొంటున్నారని వెల్లడించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు జరిగే ఉత్సవాల్లో వినోద కార్యక్రమాలతోపాటు ఆటల పోటీలు, సేద్య పరికరాలు, ఉత్పాదకాల ప్రదర్శనలు ఉంటాయని వివరించారు.

గ్రామ సచివాలయ సేవలను వినియోగించుకోవాలి

బాపట్ల డీఎల్‌డీఓ సువార్త

పిట్టలవానిపాలెం: గ్రామ సచివాలయాల సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బాపట్ల డీఎల్‌డీఓ చంద్ర సువార్త సూచించారు. మండలంలోని పిట్టువారిపాలెం, చందోలు గ్రామ సచివాలయాలను ఆమె బుధవారం పరిశీలించారు. చందోలులో ఈనెల 19, 20 తేదీలలో ఆధార్ సర్వీస్ సెంటర్ నిర్వహిస్తున్నామని వివరించారు. 24 వరకు అన్ని సచివాలయాలలో ఆధార్ సర్వీసును అందిస్తామని వెల్లడించారు. ప్రజలు ఫోన్ నంబర్ లింక్ చేయించుకుని ఇప్పటి వరకు గుంటూరు జిల్లాగా ఉన్న అడ్రసును బాపట్ల జిల్లా మార్పు చేయించుకోవాలని వెల్లడించారు. ఆమె వెంట ఎంపీడీఓ కె.పద్మజ, గ్రామ కార్యదర్శి శేషగిరిరావు ఉన్నారు.

మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్య

తెనాలి రూరల్: మద్యం తాగవద్దని కుటుంబ సభ్యులు పదే పదే చెబుతుండడంతో మనస్తాపానికి గురై వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు.. పట్టణ చినరావూరు రైస్ కాలనీకి చెందిన సారథి శరత్‌కుమార్(31) ప్రైవేటు ఉద్యోగి. కుటుంబ సభ్యులు మద్యం తాగొద్దన్నారని బుధవారం రాత్రి తన గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు.

చిన్నారులకు ఆటపాటలతో విద్యనందించాలి

ఆర్డీఓ పార్థసారథి



ఉప్పూడి అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కలిసి ఆహారం తీసుకుంటున్న ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి

రేపల్లె రూరల్: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు ఆటపాటలతో విద్యను అందించాలని రేపల్లె ఆర్డీఓ జగన్నాథ పార్థసారథి అన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాలు, ప్రాథమిక పాఠశాలల తనిఖీలలో భాగంగా మండలంలోని ఉప్పూడి పంచాయతీలోని ఆయా కేంద్రాలను ఆర్డీఓ గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చిన్నారులకు, బాలింతలకు, గర్భిణులకు సరఫరా చేస్తున్న సంపూర్ణ పౌష్టికాహారాన్ని నిర్దేశించిన మెనూ ప్రకారం విధిగా అందించాలన్నారు. ఆహారంలో నాణ్యత లోపించినా, సక్రమంగా పంపిణీ చేయకపోయినా చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు. బాలింతలు, గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తూ, కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆరోగ్యంపై నిరంతరం శ్రద్ధ వహించాలన్నారు. కేంద్రంలో నిర్వహించే విధులను తప్పనిసరిగా రికార్డులలో నమోదు చేయాలని చెప్పారు. అనంతరం గ్రామంలోని సచివాలయాన్ని సందర్శించి సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. తమ పరిధిలో పరిష్కారం కాని సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేయాలని వలంటీర్లకు తెలిపారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులతో కలిసి ఆహారం తీసుకున్నారు. కార్యక్రమంలో రెవెన్యూ, సచివాలయ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి



మున్సిపల్ కమిషనర్ విజయసారథికి వినతిపత్రం అందజేస్తున్న పారిశుధ్య కార్మికులు

రేపల్లె: మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని ఏఐటీయూసీ రేపల్లె ఏరియా కార్యదర్శి పి.నాగాంజనేయులు చెప్పారు. మున్సిపల్ కాంట్రాక్టు, పర్మినెంట్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ వర్కర్స్ యూనియన్, సీపీఐల ఆధ్వర్యంలో గురువారం మున్సిపల్ కమిషనర్ విజయసారథికి వినతి పత్రాన్ని అందించారు. నాగాంజనేయులు మాట్లాడుతూ కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులకు కొబ్బరినూనె, సబ్బులు ఇవ్వాలని కోరారు. హెల్త్ కార్డులను మంజూరు చేయడంతోపాటు దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ ఖాతాలను సవరించి రుణాలను మంజూరు చేయాలని ఆయన కోరారు. స్పందించిన కమిషనర్ విజయసారథి మాట్లాడుతూ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసరావు, దుర్గారావు, సత్యవతి, భానుమూర్తి, శివయ్య, చిరంజీవి, దుర్గమ్మ, తుపాకుల కుమారి, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో గ్రీవెన్స్ తప్పనిసరిగా నిర్వహించాలి

బాపట్ల డీఎల్పీఓ శరత్‌బాబు



ఏట్రవారిపాలెం సచివాలయం సిబ్బందితో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ శరత్‌బాబు

కర్లపాలె: గ్రామ సచివాలయాల్లో రోజూ సాయంత్రం 3 నుంచి 5 గంటల వరకు గ్రీవెన్స్ తప్పనిసరిగా నిర్వహించాలని బాపట్ల డీఎల్‌పీవో పీడీఎస్ శరత్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. ఆయన ఎంపీడీఓ ఎలీషాబాబుతో కలిసి గురువారం ఏట్రవారిపాలెం, దుండివారిపాలెం, దమ్మనవారిపాలెం గ్రామ సచివాలయాలను సందర్శించారు. సిబ్బందితో మాట్లాడారు. సూచనలు, సలహాలు ఇచ్చారు. విధి నిర్వహణ గురించి అడిగి తెలుసుకున్నారు. అర్జీలను రికార్డుల్లో పొందుపరచాలని, ఫిర్యాదుదారుని ఫోన్ నంబర్ తీసుకోవాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌కు అర్జీలు రాకపోయినా ఆ విషయాన్ని రికార్డుల్లో నమోదు చేయాలని సూచించారు. ప్రజలతో మర్యాదగా నడుచుకోవాలని సూచించారు. ప్రభుత్వ పథకాలపై సచివాలయ సిబ్బంది, వలంటీర్లకు పూర్తి అవగాహన ఉండాలని చెప్పారు. అనంతరం ఏట్రవారిపాలెం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన డీఎల్‌పీవో సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏట్రవారిపాలెం సర్పంచ్ చీరాల వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

అర్హులందరికీ ఉపాధి కల్పించాలి

డ్వామా పీడీ శంకర్‌నాయక్



పిన్నిబోయినవారిపాలెంలో ఉపాధిహామి కూలీలతో మాట్లాడుతున్న డ్వామా పీడీ వై. శంకర్‌నాయక్

బాపట్లటౌన్: ఉపాధిహామీ పథకంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పని కల్పించాలని డ్వామా పీడీ వై.శంకర్‌నాయక్ తెలిపారు. పిన్నిబోయినవారిపాలెంలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను ఆయన గురువారం పరిశీలించారు. పీడీ శంకర్‌నాయక్ మాట్లాడుతూ ఉపాధి కూలీలందరికీ దినసరి వేతనం రూ.257 తగ్గకుండా అందించాలన్నారు. తూర్పు పిన్నిబోయినవారిపాలెంలో ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ నిర్మాణం కోసం స్థలాన్ని పరిశీలించి వెంటనే పనులు ప్రారంభించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏపీఓ కోటయ్య నాయక్, పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, టెక్నికల్ అసిస్టెంట్ శ్యామ్, వీఆర్వో రాంబాబు పాల్గొన్నారు.

పోలవరం రూపశిల్పి శొంఠి రామమూర్తి



శొంఠి రామమూర్తి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

బాపట్ల: పోలవరం రూపశిల్పి శొంఠి రామమూర్తిని అపర మేధావిగా చెప్పుకోవచ్చని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టర్ పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. శొంఠి రామమూర్తి వర్ధంతి సందర్భంగా గురువారం టౌన్‌హాలులో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ పి.సి.సాయిబాబు మాట్లాడుతూ పోలవరం కోసం అప్పటి ప్రధాని నెహ్రూను కలిసి, ఆయనను మెప్పించి రామమూర్తి కేంద్ర క్యాబినెట్ ఆమోదం పొందారని గుర్తు చేశారు. బ్రిటిష్ హయాంలో మద్రాసు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా, బొంబాయి గవర్నరుగా పని చేసిన తొలి భారతీయుడు శొంఠి అని చెప్పారు. 1912లోనే ఉమ్మడి ఐసీఎస్ పరీక్షలో ద్వితీయ స్థానాన్ని సాధించి, తెలుగు వారి సత్తా చాటారని గుర్తు చేసుకున్నారు. మద్రాసు గవర్నర్ సలహాదారుగా శొంఠి రామమూర్తి 1945లో బాపట్ల వ్యవసాయ కళాశాలకు ప్రారంభోత్సవం చేశారని వివరించారు. పేపర్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.